# అంతర్జాతీయ వడ్రంగి పోటీలకు యశ్వంత్ చారి ఎంపిక






**సికింద్రాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు):** సాంప్రదాయ కులవృత్తులు కనుమరుగవుతున్న ప్రస్తుత కాలంలో, వృత్తిపై నమ్మకం, నైపుణ్యంపై పట్టుదల ఉంటే ప్రపంచ స్థాయిలోనూ గుర్తింపు సాధించవచ్చని నిరూపిస్తున్నాడు యువ ప్రతిభావంతుడు కేసోజు యశ్వంత్ చారి. చైనాలో జరగనున్న అంతర్జాతీయ వడ్రంగి వృత్తి పోటీలలో భారతదేశం తరపున పాల్గొనే అరుదైన అవకాశాన్ని ఆయన దక్కించుకున్నాడు. ఈ ఘనత ద్వారా ఆయన కేవలం విశ్వకర్మ సమాజానికే కాకుండా దేశానికి సైతం గర్వకారణంగా నిలిచాడు. సంప్రదాయ వృత్తికి ఆధునిక నైపుణ్యాలను జోడించి విశిష్ట గుర్తింపు పొందుతూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఈ విశ్వకర్మ కుటుంబ వారసుడు దేశానికి, రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని విశ్వకర్మ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కేసోజు బ్రహ్మాచారి, మాధవి దంపతుల కుమారుడైన యశ్వంత్ చారి ప్రస్తుతం హైదరాబాద్ నారాయణగూడ లోని కేశవ్ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. చిన్ననాటి నుంచే వడ్రంగి వృత్తిపై ఆసక్తి పెంచుకున్నాడు. కలప పనులలో సృజనాత్మకత, ఖచ్చితత్వం, నాణ్యతను ప్రదర్శిస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకున్నాడు. సంప్రదాయ నైపుణ్యాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మేళవించి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తన ప్రతిభను తీర్చిదిద్దుకున్నాడు. ఆయన కృషి, పట్టుదల, అంకితభావం ఫలితంగానే చైనాలో నిర్వహించబోయే అంతర్జాతీయ వడ్రంగి పోటీలలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ (మీవీజు) అధికారుల సహకారంతో లభించింది. ఇది కేవలం తనకు ఒక వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా, శతాబ్దాలుగా విశ్వకర్మ సమాజం కొనసాగిస్తున్న వృత్తి నైపుణ్యాలకు దక్కిన గౌరవంగా పలువురు అభిప్రాయపడుతున్నారు. భారతీయ వడ్రంగుల కళా నైపుణ్యం, సృజనాత్మకత, శ్రమ ప్రపంచ స్థాయిలో ఎంత ఉన్నతంగా ఉందో చాటిచెప్పేందుకు యశ్వంత్ చారి ఎంపిక ఒక గొప్ప అవకాశమని పేర్కొంటున్నారు. ప్రస్తుతం అనేకమంది యువత తమ సంప్రదాయ వృత్తులను తక్కువగా భావిస్తూ ఇతర ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్న తరుణంలో, ఏ వృత్తీ చిన్నది కాదని, నైపుణ్యానికి ప్రపంచవ్యాప్తంగా గౌరవం ఉంటుందని యశ్వంత్ చారి ప్రయాణం నిరూపిస్తోందని విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. వృత్తిపై ప్రేమ, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించవచ్చని ఆయన ఉదాహరణగా నిలుస్తున్నాడని చెబుతున్నారు. యశ్వంత్ చారి విజయంలో ఆయన తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమని పలువురు కొనియాడుతున్నారు. పిల్లల ఆసక్తులను ప్రోత్సహిస్తే వారు ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనే విషయానికి ఈ సంఘటన నిదర్శనంగా నిలుస్తోందన్నారు. చైనాలో జరిగే పోటీలలో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతిభావంతులతో పోటీ పడనున్న యశ్వంత్ చారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, భారతీయ జెండాను అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించాలని, ప్రథమ బహుమతిని సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, విశ్వకర్మ సమాజానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా చేరాల జలంధ్రాచారి, శ్రీరామదాసు వెంకటరమణాచారి, కర్లేగంటి పుల్లయ్య చారి,కే. బ్రహ్మాచారి తదితర విశ్వకర్మ ప్రముఖులు యశ్వంత్ చారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన అంతర్జాతీయ వేదికపై విజయకేతనం ఎగురవేసి స్వదేశానికి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ తమ ఆశీస్సులు అందించారు. "వృత్తి పట్ల గౌరవం, నైపుణ్యం పట్ల అంకితభావం ఉంటే ప్రపంచమే వేదిక అవుతుంది" అనే సందేశాన్ని కేసోజు యశ్వంత్ చారి నేటి యువతకు అందిస్తున్నాడని విశ్వకర్మ సమాజం గర్వంగా పేర్కొంటోంది.

# ఉపాధ్యాయ , విద్యారంగ పరిరక్షణే ఎస్టీయూ ధ్యేయం

**ఇరు రాష్ట్రాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న**

**జగిత్యాల జిల్లా ఎస్టియు నాయకులు**



**జగిత్యాల:** ప్రభుత్వ ఉపాధ్యాయ , విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా స్టేట్ టీచర్స్ యూనియన్ పని చేస్తుందని ఎస్టీయు నాయకులు పునరుద్ఘాటించారు...బుధవారం రాజమండ్రిలో ఆంధ్ర , తెలంగాణ రాష్ట్రాల స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది..ఉపాధ్యాయుల హక్కుల సాధన, విద్యా రంగ పరిరక్షణే ధ్యేయంగా జూన్ 9, 1947 న ఆవిర్భవించిన ప్రతిష్టాత్మక ఉపాధ్యాయ సంఘం "స్టేట్ టీచర్స్ యూనియన్" (ఎస్టియు ) విజయవంతంగా 79 వసంతాలు పూర్తి చేసుకుని, 80వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. . ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి నగరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎస్టీయూ నాయకుల "ఆత్మీయ సమ్మేళన సమావేశం" అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో ఎస్టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బైరం హరికిరణ్, ప్రధాన కార్యదర్శి పాలెపు శివరామకృష్ణ , రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీర్ణంచ రవీందర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మేకల ప్రవీణ్, మేడిపల్లి మండల అధ్యక్షులు నరేందర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి పూర్వమే ఉపాధ్యాయ లోకం కోసం పురుడుపోసుకున్న ఎస్టీయూ సంఘం గడిచిన ఎనిమిది దశాబ్దాలుగా అనేక చారిత్రాత్మక పోరాటాలను నడిపిందని గుర్తుచేశారు. నాణ్యమైన ఉచిత ప్రభుత్వ విద్యను సామాన్యుడికి అందించడంలోనూ, ఉపాధ్యాయుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారంలోనూ ఎస్టీయూ ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలిచిందని కొనియాడారు. ఉపాధ్యాయులకు పే స్కేల్స్ సాధించడమే కాకుండా, వివాదాస్పద అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించి, సకాలంలో పీఆర్సీ డీఏ (ఇ.వా)లు ఉపాధ్యాయ లోకానికి అందేలా చేసిన ఘనత ఒక్క స్టేట్ టీచర్స్ యూనియన్ కే దక్కుతుందని నాయకులు ఈ సందర్భంగా గర్వంగా గుర్తుచేశారు. 1947 నుండి నేటి వరకు ఎస్టీయూ సాగించిన రాజీలేని పోరాటాలు, సాధించిన హక్కుల ఉమ్మడి వారసత్వాన్ని కాపాడుకోవడం, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం కోసం నిరంతరం ఎస్టియు పోరాటం చేస్తుందన్నారు.. రెండు రాష్ట్రాల్లోనూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం, మరియు ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించడానికి ఈ ఆత్మీయ సమ్మేళనం దోహద పడిందన్నారు. ఇరు రాష్ట్రాల ఎస్టీయూ నాయకుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసిందని, రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల హక్కుల కోసం, విద్యా రంగ వికాసం కోసం సరికొత్త ఉత్సాహంతో కలిసికట్టుగా పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం జగిత్యాల జిల్లా శాఖ పక్షాన రాజమండ్రి ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న నాయకులను ఇరు రాష్ట్రాల రాష్ట్ర నాయకులు సదానందం గౌడ్, సాయి శ్రీనివాస్ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు శాలువ, మెమెంటో తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇరు రాష్ట్రాలకు చెందిన పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో ఎక్కడా ధాన్యం కోతలు జరగలేదు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు**

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**

**48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాలకు చెల్లింపులు**




**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల ) జూన్ 10 :** జగిత్యాల జిల్లాలో ఎక్కడా ధాన్యం కోతలు జరగలేదని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రబీ 2025–26 సీజన్‌లో జిల్లాలో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 5.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 436 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ధాన్యంలో కోతలు జరుగుతున్నాయని, కొనుగోళ్లు సక్రమంగా లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ఈ ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు. మిల్లర్ల వద్ద స్థల సమస్యలు ఎదురైన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు జిల్లాను సందర్శించారని, మిల్లర్లు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించామని చెప్పారు. మొత్తం 81,954 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే రూ. 1,075 కోట్లు విడుదల చేశామని, దాదాపు 90 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల ఖాతాల్లో 48 నుంచి 72 గంటల్లోనే నగదు జమ అవుతోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇదెక్కడి సాంప్రదాయం

**సందర్భం లేకుండా ఇందిరమ్మ చీరల పంపిణీ**

**తెలంగాణ సాంప్రదాయాన్ని విస్మరిస్తున్న ఎమ్మెల్యే**

**- మాజీ జడ్పీ చైర్ పర్సన్ ఆరోపణ**



**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల జిల్లా) :** ఇందిరమ్మ చీరల పంపిణీ అంటూ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హడావుడి చేస్తున్నారని మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావసంత సురేష్ అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలో టిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వసంత సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులకు పండుగలకు ఏదైనా ముఖ్యమైన పర్వదినం చూసుకొని చీరలు సారే పెట్టడం తెలంగాణ సాంప్రదాయం. కానీ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ సందర్భం లేకుండా ఇందిరమ్మ చీరల పంపిణీ అంటూ నియోజకవర్గ మహిళలను ఆగమాగం చేస్తున్నారన్నారు. గత నాలుగు రోజుల క్రితం జగిత్యాల పట్టణంలో ఇందిరామ్మ చీరలు పంపిణీ చేస్తామని మహిళలను ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఒక ఫంక్షన్ హాల్ లో గంటల తరబడి కూర్చోబెట్టి చివరకు పంపిణీ ప్రోగ్రాం రద్దు చేయించారు. చీరలు అంటే మహిళలకు అమితమైన ప్రేమ. మహిళల బలహీనతను పట్టుకొని ఇందిరమ్మ చీరలు ఆశ చూపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వసంత విమర్శించారు. పండుగలు ఏమీ లేకుండానే ఇందిరమ్మ చీరల పంపిణీ ఏంటో దాని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో ఎమ్మెల్యేకే తెలియాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలకు పేరు మార్చి ఇందిరమ్మ చీర పేరు పెట్టి పంపిణీ చేయడం మహిళలు గమనించారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క పథకం సజావుగా నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజలు తీవ్రమైన నిరసనతో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రజాసేవ ముసుగులో కోట్ల రూపాయల కాంట్రాక్టు పనులు చేసుకుంటూ అప్పుడప్పుడు ఇందిరమ్మ చీరలు అంటూ మహిళలు తన పేరును మరిచిపోకుండా జ్ఞాపకం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు ఎలిగేటి అనిల్ కుమార్, బర్కాం మల్లేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు మరంపెల్లి రాణి, సాయి కుమార్, ఉదయశ్రీ, నాయకులు రమపతి రావు, రాజేందర్ గౌడ్, ప్రశాంత్ రావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**భీమదేవరపల్లి జూన్ 10( ప్రజా మంటలు):-** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పాతపల్లి సంపత్ తెలిపారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని నల్ల చంద్రారెడ్డి కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60 వేల రూపాయల చెక్కు పంపిణీ చేసినట్లు తెలిపారు... అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత కుటుంబానికి అన్నివేళలా అండగా నిలుస్తుందని, లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు... ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నారగోని నరేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోచంపల్లి రాజిరెడ్డి, గూడెల్లి ధర్మేందర్ రెడ్డి, బర్రె రమణ రెడ్డి, రంగు రవీందర్, తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా ట్రెజరీ అధికారి గా ఎస్. పద్మ

**శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి**




**(- చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల) :** జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారిణిగా ఇటీవలే బదిలీ పై వచ్చిన ఎస్.పద్మ బాధ్యతలు స్వీకరించారు. టిఎన్జీఓ జిల్లా అధ్యక్షులు ఉద్యోగ జేఏసీ చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి, టిఎన్జీఓ జిల్లా కార్యదర్శి ఊకంటి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రెజరీ అధికారిణిని ఉద్యోగులు పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా టిఎన్జీఓ జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. జిల్లా ట్రెజరీ అధికారి పద్మ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ప్రయోజనాల కు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించే విషయంలో తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటిఓ లు మధు కుమార్, ఎస్టిఓ లు లావణ్య, విజయ్ కుమార్, సత్యనారాయణ, టిఎన్జీఓ జిల్లా నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రవి కుమార్, రాజేశం, సుగుణాకర్, ప్రమోద్ కుమార్, శరత్, సీనియర్ అకౌంటెంట్లు చందు, శ్రీనివాస్, వినయ్, అఖిల్, సంతోష్, శ్రీనివాస్, ఆలం, గణేష్, అనిల్, సాయి చరణ్, రాజు, గీత, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ, ఖలీం, ఇంతియజ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## తుగ్లక్ పాలనను తలపిస్తున్న రేవంత్ నిర్ణయాలు

**27 వేల బడులను 4 వేలకు కుదించే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి**

**బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు మండల సురేందర్**



**భీమదేవరపల్లి జూన్ 10(ప్రజా మంటలు ) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ నిర్వహణ పూర్తిగా అధ్వానంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు తుగ్లక్ పాలనను తలపిస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండల సురేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం నాడు ఆయన భీమదేవరపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో, దాన్ని పూర్తిగా బలహీనపరిచే విధానాలను అవలంబించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒకవైపు ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతూనే, మరోవైపు రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేలకు కుదించేందుకు ప్రయత్నించడం రేవంత్ సర్కారు అసమర్థతకు నిదర్శనమన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత,నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతని తెలిపారు. పాఠశాలల కుదింపు నిర్ణయం విద్యా హక్కు చట్టం (–2009) స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. పాఠశాలల విలీనం లేదా కుదింపు కారణంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు విద్యా సౌకర్యాలకు దూరమై, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. విద్యారంగంపై చేసే ఖర్చును ప్రభుత్వం వ్యయంగా కాకుండా, దేశ భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా చూడాలన్నారు. గ్రామీణ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే సామాన్యుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రేవంత్ ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూనే విద్యా కమిషన్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారని, ఈ ఒక్క ఘటనతోనే విద్యాశాఖలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి, పాఠశాలల కుదింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మండల సురేందర్ డిమాండ్ చేశారు. తక్షణమే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని,పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రభుత్వ విద్యా ప్రమాణాలను పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభలో అధికారుల గైర్హాజరు

**విద్యుత్ సమస్యలపై ఏఈని నిలదీసిన గ్రామస్తులు**



**గొల్లపల్లి, జూన్ 10 (ప్రజా మంటలు) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గొల్లపల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. అయితే, పూర్తి స్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ నల్ల నీరజ అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సమక్షంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాల గురించి ప్రజలకు వివరించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో రోడ్లు, మురుగు కాలువలు, డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామపంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా కాలువలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబం తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి కరుణ మాట్లాడుతూ రైతులు వరి, మొక్కజొన్న, పత్తితో పాటు కందులు, పెసర్లు వంటి పంటలను కూడా సాగు చేయాలని సూచించారు. వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిన వరికొయ్యలను తగులబెట్టడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు ప్రయోజనకరమైన క్రిమికీటకాలు నశిస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎవరైనా వరికొయ్యలను తగులబెడితే రూ. 5,000 జరిమానా విధిస్తామని గ్రామసభలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు ఉచిత విద్యుత్ పథకంలో 200 యూనిట్ల లోపు వినియోగం ఉన్నప్పటికీ విద్యుత్ బిల్లులు ఎందుకు వస్తున్నాయని విద్యుత్ శాఖ ఏఈ రాకేష్‌ను నిలదీశారు. దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుచ్చయ్య, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ ఏఈ రాకేష్, వ్యవసాయ అధికారి కరుణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్లలో రూ.107 కోట్ల అవినీతి: మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సవాల్



**జగిత్యాల, జూన్ 10 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల ఈశ్వర ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిర్వహించిన విలేకరుల సమావేశానికి ప్రతిస్పందిస్తూ, ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ తరచూ "రాజీనామా చేస్తా" అనే వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మారిందని ఎద్దేవా చేసిన కొప్పుల ఈశ్వర్, ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత కూడా ఇలాంటి ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఇప్పటికీ అనేక కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 శాతం వడ్లు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తిరిగి వడ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 40 కిలోల బస్తాకు 3.3 నుంచి 3.4 కిలోల వరకు కటింగ్ చేసిన ఘటనలు జరిగాయని, ఏ కొనుగోలు కేంద్రానికి వెళ్లినా రైతులు ఈ విషయాన్ని చెబుతారని ఆయన అన్నారు. వడ్లు పోసిన తర్వాత నెలల తరబడి రైతులు కల్లాల వద్ద వేచి ఉండాల్సి వచ్చిందని, కాంటాలు ప్రారంభించడంలో తీవ్ర జాప్యం జరిగిందని ఆరోపించారు. గ్రేడ్ పేరుతో రైతుల నుంచి డబ్బులు వసూలు చేశారని, ప్రభుత్వం నిర్ణయించిన ఏ–గ్రేడ్ ధరకు బదులుగా బీ–గ్రేడ్‌గా చూపించి తక్కువ ధరకు కొనుగోలు చేశారని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. హమాలీ చార్జీలు గతంలో బస్తాకు రూ. 20 ఉండగా ప్రస్తుతం రూ. 40 వరకు వసూలు చేశారని, లారీ రవాణా పేరిట అదనపు వసూళ్లు చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేవని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు ఉండేవని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో క్వింటాల్‌కు 7 నుంచి 8 కిలోల వరకు తరుగు పేరుతో కోత విధించారని, మొత్తం జిల్లాలో సుమారు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంపై ఈ కోతల ద్వారా రూ. 107 కోట్ల మేర రైతుల నష్టం జరిగిందని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. చివరగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు సవాల్ విసురుతూ, "అవినీతి జరగలేదని చెబుతున్న మీరు ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలి. లేకుంటే రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

## మహిళల భద్రతపై ప్రభుత్వం విఫలమైంది: కవిత



**హైదరాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు) :** రాష్ట్రంలో మహిళలు, బాలికలపై పెరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటన, మల్కాజిగిరిలో మహిళ హత్య రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ఖమ్మం ఘటనలో నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, మల్కాజిగిరి ఘటనలో ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిందని పేర్కొన్నారు. మహిళలపై నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యమంత్రి పాలనపై పట్టు కోల్పోయారని ఆరోపించారు. మహిళల రక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, రెండు ఘటనల్లోనూ నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

## గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

**ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్**



**భీమదేవరపల్లి/జూన్10 (ప్రజా మంటలు) :** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో మాట్లాడిన అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, వ్యవసాయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మహిళా మరియు శిశు సంక్షేమ కార్యక్రమాల అమలు, సాగునీటి సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, మండల వ్యవసాయ అధికారి పద్మ, ఎంఈవో సునీత రాణి, గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ, ఇరిగేషన్ ఏఈ శశిధర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, సేవల గురించి గ్రామస్తులకు వివరించి, ప్రజల నుంచి వచ్చిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. గ్రామసభలో గ్రామస్తులు తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలే లక్ష్యంగా ఈ గ్రామసభ నిర్వహించబడిందని ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ తెలిపారు. గ్రామ ప్రజలు పాల్గొని గ్రామసభను విజయవంతం చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, రైతులు, యువకులు మరియు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 12 ఏళ్ల మోదీ పాలన,అభివృద్ధి, సుశాసనానికి నిదర్శనం




**సికింద్రాబాద్, జూన్ 10 (ప్రజా మంటలు) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 మే 26న బాధ్యతలు స్వీకరించి ఈనాటికి 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. జన్ ధన్ యోజన, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్ వంటి సంక్షేమ పథకాలతో పాటు డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, వంటి సంస్కరణల ద్వారా దేశ అభివృద్ధికి కొత్త దిశ చూపించారు. కరోనా సమయంలో వేదిక ద్వారా భారీ స్థాయిలో టీకాలు అందించగా, వ్యాక్సిన్ మైత్రి ద్వారా ప్రపంచ దేశాలకు సహాయం చేశారు. ఆర్టికల్ 370 రద్దు, నారీ శక్తి వందన్ చట్టం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వందే భారత్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో ప్రాజెక్టులు, కొత్త పార్లమెంట్ భవనం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విదేశాంగ రంగంలో భారత ప్రతిష్టను పెంచారని బీజేపీ స్టేట్ టీచర్ సెల్ కో–కన్వీనర్ శివ రామకృష్ణ ఆచార్య పేర్కొన్నారు.

